సాక్షి జగిత్యాల

శనివారం । 19 । ఆగస్టు । 2023



స్వామివారికి మొక్కులు

జగిత్యాలరూరల్/జగిత్యాలజోన్: శ్రావణమాసం సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు శుక్రవారం పొలాస శ్రీపొలస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



శ్రావణ మాసం పూజలు

కథలాపూర్: వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
27.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

మహనీయులను స్మరించుకోవాలి



నివాళి అర్పిస్తున్న అతిథులు

జగిత్యాల: మహనీయులను స్మరించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం సర్వాయిపాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పాపన్నగౌడ్ ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలర్పించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, బహుజన బిడ్డలకు ఆర్థిక సమానత్వం కల్పించాలని కత్తిపట్టిన యోధుడన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, అదనపు కలెక్టర్ లత, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు

కోరుట్లరూరల్: టీపీసీసీ డెలిగేట్ జువ్వాడి నర్సింగరావు కోరుట్ల అసెంబ్లీ స్థానంలో పోటీ చేసేందుకు తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో దరఖాస్తు సమర్పించారు. ఆయన వెంట కోరుట్ల, మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు కొంతం రాజం, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

త్వరలో టీచర్ పోస్టుల భర్తీ



సభ్యత్వ నమోదులో నాయకులు

జగిత్యాల: పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి ప్రభుత్వం సుముఖంగా ఉందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు అన్నారు. శుక్రవారం పలు పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ, జిల్లాలో 108 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని టీఆర్‌టీ ద్వారా భర్తీ చేస్తారని తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు మహేశ్, సత్యరాజ్, బాసిత్, శ్యామ్‌సుందర్, జమున, చందన, శశికళ పాల్గొన్నారు

ఆరోగ్య సలహాలు ఇవ్వాలి




మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

కథలాపూర్(వేములవాడ): బీపీ, షుగర్ పేషెంట్లకు నెలకోసారి వైద్యసిబ్బంది పరీక్షలు చేసి మందులు అందిస్తూ ఆరోగ్య సలహాలు ఇవ్వాలని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ సూచించారు. శుక్రవారం మేడిపెల్లి మండలం కొండాపూర్ గ్రామంలో బీపీ, షుగర్ పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవల తీరు పరిశీలించారు. అసంక్రమిత వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక రికార్డులు నమోదు చేసి ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి ప్రవీణ్‌చంద్ర ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మూడో దశ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆగస్టు – 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందడానికి రెండోదశలో మిగిలిన సీట్ల కోసం మూడోదశలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాల ఆధారాలతో ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వైన్స్‌కు 2,521 దరఖాస్తులు



చివరిరోజు దరఖాస్తుదారుల బారులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో గల మద్యం దుకాణాలకు శుక్రవారం వరకు 2,521 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. దరఖాస్తుదారులు 3 పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, దరఖాస్తు రుసుం రూ.2 లక్షల డీడీతో ధరూర్ క్యాంప్ ఎక్సైజ్ కార్యాలయ కౌంటర్లలో సమర్పించాలన్నారు. ఎక్సైజ్ శాఖ జారీచేసిన పాస్‌లను తీసుకుని ఈనెల 21న ఉదయం 10గంటలకు జగిత్యాలలోని వీరూపాక్షి గార్డెన్స్‌లో జరిగే డ్రాకు హాజరు కావాలన్నారు.



కొనసాగుతున్న పైప్‌లైన్ నిర్మాణం

శరవే'గంగా..'

కొండగట్టుకు గోదావరి జలాలు

- చురుగ్గా 'ఎత్తిపోతల' పనులు
- పైపులైన్ ద్వారా కొండగట్టు అంజన్న చెంతకు..
- ముత్యంపేట శివారు నుంచి 1.7కి.మీ. పొడవున నిర్మాణం
- అంచనా వ్యయం రూ.13.48కోట్లు



ముత్యంపేట శివారులోని వరదకాలువ

మల్యాల(చొప్పదండి): దశాబ్దాలుగా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి భక్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. కాళేశ్వరం ద్వారా తరలిస్తున్న గోదావరి నదీ జలాలు.. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరద కాలువకు చేరుకుంటున్నాయి. ముత్యంపేటలోని వరద కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి చెంతకు తరలించేలా ప్రస్తుతం పనులు సాగుతున్నాయి.

పైపులైన్ ద్వారా తరలింపు..

- ముత్యంపేట గ్రామంలోని వరదకాలువ నుంచి కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధికి గోదావరి జలాలు తరలించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.
- అయితే, సీఎం కేసీఆర్ ఈ ఏడాది ఫిబ్రవరి 15న కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అదేరోజు నీటిపారుదల శాఖ అధికారులతో ఇదే విషయంపై సీఎం కేసీఆర్ చర్చించారు.
- ఏడాది పొడవునా వరద కాలువలో నీరు అందుబాటు ఉంటుందని, కాళేశ్వరం నుంచి ఎల్లంపల్లికి, అక్కడి నుంచి కొండగట్టుకు నీటిని తరలిస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.
- దీంతో మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వరద కాలువ 81.140వ కి.మీ. వద్ద ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు.
- ఈమేరకు నీటిపారుదల శాఖ జీవో నంబర్ 66 ద్వారా చేపట్టే ఈ పనులకు రూ.13.43 కోట్లు కేటాయిస్తూ అనుమతి ఇచ్చింది.
- ఈమేరకు రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ప్రజాప్రతినిధులు గత జూలై 20న పనులకు శంకుస్థాపన చేశారు.

1.7 కి.మీ. దూరం.. రూ.13.48కోట్ల వ్యయం..

ముత్యంపేట శివారు వరదకాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా కొండగట్టు గుట్టల మధ్య ఉన్న సంతలొద్ది చెరువులోకి గోదావరి జలాలు తరలిస్తారు. ఇందుకోసం సుమారు 1.7కి.మీ. పొడవున పైపులైన్ నిర్మిస్తారు. సంతలొద్ది నుంచి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధికి నీటిని సరఫరా చేస్తారు. కాగా, వరద కాలువ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు 150 కిలోవాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ మోటార్లు వినియోగిస్తారు. వీటిద్వారా నిత్యం 10 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. మొత్తంగా ఎత్తిపోతలకు రూ.13.48కోట్లు వెచ్చిస్తున్నారు.

రోజూ రెండు మోటార్లు..

- వరదకాలువ నుంచి సంతలొద్ది చెరువులోకి నీటిని తరలించేందుకు రెండు భారీ విద్యుత్ మోటార్లు వినియోగిస్తారు. వీటి ద్వారా పైపుల్లోకి నీటిని ఎత్తిపోస్తారు. వీటి వ్యాసార్థం సుమారు 400మి.మీ. ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, ఎత్తిపోతల పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. నిత్యం 10 క్యూసెక్కుల ద్వారా 14 రోజులపాటు నీటిని తరలిస్తే 0.01328 టీఎంసీల నీటినిల్వ గల సంతలొద్ది చెరువు నిండుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత చెరువు కట్టను మరో 100 మీటర్లకు విస్తరిస్తారు.

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులు నీటి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆంజనేయస్వామిని దర్శించుకున్న సీఎం.. యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– సుంకె రవిశంకర్, ఎమ్మెల్యే, చొప్పదండి

సమస్యలకు శాశ్వత పరిష్కారం



కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎత్తిపోతల ద్వారా సంతలొద్దికి నీటిని సరఫరా చేస్తారు. అక్కడి నుంచి కొండగట్టు గుట్టపైకి తీసుకెళ్తారు. తద్వారా ఏడాది పొడవునా నీరు పుష్కలంగా అందుబాటులో ఉంటుంది.

– బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచ్, ముత్యంపేట

గాయాలతోనే బాలిక మృతి?

- లైంగికదాడిపై పోలీసులకు లభించని ఆధారాలు
- బాలికను చితకబాదడం వల్లే ఆత్మహత్యాయత్నం!
- చెరువు, పురుగు మందు షాపుల వద్దకు అందుకే వెళ్లిందా?
- గాంధీ ఆస్పత్రి నివేదిక వస్తేనే నిజం తెలిసేది



బాలిక ఇంటి వద్ద కూలీలు (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన పెద్దపల్లి జిల్లాలో మధ్యప్రదేశ్ బాలిక కేసు మరో మలుపు తిరిగింది. ఆగస్టు 14వ తేదీ రాత్రి బాలికపై సామూహిక లైంగికదాడి జరిగిందని, దాంతో అమ్మాయి అనారోగ్యం పాలై, మరణించిందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా బాలిక ఒంటిపై గాయాలున్న మాట వాస్తవమే గానీ, లైంగికదాడి జరిగినట్లుగా పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదన్న విషయం సంచలనం రేపుతోంది. ఈ దుర్ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే రామగుండం పోలీసులు స్పందించారు. గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు, పెద్దపల్లి డీసీపీలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన సీపీ రెమా రాజేశ్వరి కేసును స్వయంగా పర్యవేక్షించారు. అసలు అనారోగ్యంతో ఉన్న బాలికను గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు తరలించాల్సి వచ్చింది? వీరికి వాహనం ఎవరు సమకూర్చారు? తనపై కొందరు లైంగికదాడి జరిపారు.. అంటూ బాలిక చెబుతున్న ఆడియోలో వాస్తవమెంత? తదితర విషయాలపై దాదాపు 48 గంటల సుదీర్ఘ సాంకేతిక, శాస్త్రీయ దర్యాప్తు తర్వాత రామగుండం పోలీసులు ఈ మేరకు నిర్ధారణకు వచ్చారని తెలిసింది.

ఇంట్లో వారే కొట్టారా?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట శివారులోని అక్కాబావల వద్దకు మధ్యప్రదేశ్ నుంచి బాలిక వచ్చింది. ఆమె మరణానికి ముందు ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. ఇవి ఎవరు చేశారు? అన్నదానిపై స్పష్టత లేదు. బాలికను కుటుంబసభ్యులు లేదా తెలిసినవారే తీవ్రంగా కొట్టారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరోజు తనను తీవ్రంగా కొట్టడంపై బాలిక మనస్తాపానికి గురైంది. అది తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసుకోవాలనుకుందేమోనని అనుమానిస్తున్నారు. బాలిక చివరిసారిగా కనిపించిన పరిస్థితులు ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఆమె ఆగస్టు 14 మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఇంట్లో లేదు. ఆ సమయంలో ఏం చేసింది? అన్నదానిపై పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా అణువణువూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో బాలిక పురుగుల మందు షాపుల ముందు, రాత్రి 8 గంటల ప్రాంతంలో సమీపంలోని ఓ చెరువు వద్ద కూడా కనిపించిందని సమాచారం. అర్ధరాత్రి చెరువు వద్ద ఏం చేస్తున్నావని కొందరు మందలించడంతో అక్కడి నుంచి బస్టాండ్ వైపు వెళ్లినట్లు తెలిసింది. ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంది కాబట్టే.. ఈ రెండు ప్రాంతాల్లో కనిపించిందని పోలీసులు భావిస్తున్నారు. ఇంటి నుంచి బస్టాండ్ వద్దకు బాలిక సంచరించిన ప్రాంతాల్లో మొత్తం 15 మంది ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. రాత్రి 11 గంటల తర్వాత ఇంటికి చేరిన బాలిక.. అస్వస్థతకు గురైంది. వెంటనే బాలిక బంధువులు కారు మాట్లాడుకొని, ఆమెను హుటాహుటిన మధ్యప్రదేశ్‌లోని బాల్‌ఘాట్ జిల్లా కజ్రీ గ్రామానికి తరలించారు. మార్గమధ్యలో వాంతులు చేసుకుంది. విషయం తెలుసుకున్న రామగుండం పోలీసులు అక్కడి ఎస్పీని సంప్రదించారు. తొలుత బాలిక మరణించిన విషయాన్ని ధ్రువీకరించుకున్నాక అంత్యక్రియలు జరపకుండా ఆపగలిగారు. అంత్యక్రియలు ఆపేది లేదంటూ ఆమె బంధువులు వాదనకు దిగారు. ఎంతో శ్రమిస్తే గానీ.. వారు దారికి రాలేదు. ఎట్టకేలకు బాలిక మృతదేహానికి అక్కడ స్థానిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, తిరిగి సెకండ్ ఒపీనియన్ కోసం గాంధీ ఆస్పత్రికి మరోసారి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

గాయపరిచింది ఎవరు?

బాలిక ఒంటిపై గాయాలున్నాయి తప్పితే, లైంగికదాడి జరిగినట్లుగా ఎలాంటి ఆనవాళ్లు లేవని తెలిసింది. మరి ఆమెను మరణించేంత స్థాయిలో గాయపరిచింది ఎవరు? అసలు ఆగస్టు 14 మధ్యాహ్నం ఏం జరిగింది? బాలిక ఎవరితో ఘర్షణ పడింది? ఆమెపై ఎవరు దాడి చేసి ఉంటారు? అన్న విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సామూహిక లైంగికదాడి జరిగిందని ప్రచారం కావడం, అందులోనూ బాధితురాలు మైనర్ కావడంతో విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. అన్ని బృందాల పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఇంతవరకూ దర్యాప్తు పురోగతిలో ఏ విషయాన్ని మీడియాతో పంచుకోలేదు. ఈ క్రమంలోనే అమ్మాయి మాట్లాడిందని చెబుతున్న ఆడియో విడుదల చేసిన వారిని అదుపులోకి తీసుకొని, ప్రశ్నించినట్లు తెలిసింది. వారు చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నాయని సమాచారం. గాంధీ ఆస్పత్రి నుంచి నివేదిక వస్తేగానీ.. పోలీసులు ఈ విషయంలో ఎలాంటి ప్రకటన చేసేలా లేరు. ఆ నివేదికలో ఏం ఉంటుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ



ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: నేరాలను నియంత్రించేందుకు, పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఠాణాల పనితీరు, కేసుల పురుగతిపై సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరించాలన్నారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలో నమోదైన కేసుల స్థితిగతులను తరచూ సమీక్షించాలన్నారు. తప్పిపోయిన వ్యక్తులను వారి కుటుంబాలతో తకలపడానికి దర్పన్ ఫేస్ రికగ్నిషన్ పోర్టల్ సహాయపడుతుందని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాల మూలాలు, కీలక వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. మట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా నియంత్రపై నిఘా ఉంచాలని చెప్పారు. పాతనేరస్తులను బైండోవర్ చేయాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రరెడ్డి, రఘుచందర్, రవీంద్రకుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ, ఆయుధాల వినియోగంపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. డీఎస్పీలు వెంకటస్వామి, రవీందర్ రెడ్డి, రవీందర్‌కుమార్, రఘుచందర్ ఉన్నారు.

మట్టి తవ్వకాలపై నిరసన



ఆందోళన చేస్తున్న కొండ్రికర్ల గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: కొండ్రికర్ల – కోనరావుపేట బోడగుట్ట(చెరువుగుట్ట)వద్ద మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కొండ్రికర్ల గ్రామస్తులు శుక్రజువారం ఆందోళన చేపట్టారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టి విక్రయించి సొమ్ము చేసుకున్న కోనరావుపేటకు చెందిన కొందరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో, డీఎస్పీ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు మెట్‌పల్లి ఎస్సై శ్యాంరాజ్‌కు ఫిర్యాదు చేశారు. రాజారెడ్డి, శ్రీనివాస్,సత్యనారాయణగౌడ్, సత్తయ్య, రాజేశ్వర్, రమేశ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

వెల్గటూర్(ధర్మపురి): బీఆర్‌ఎస్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జూపాక కిరణ్ ఆధ్వర్యంలో మాల సంఘం సభ్యులు, ముక్కట్రావుపేట, రాంనూర్, స్తంభంపల్లికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు సుమారు 100 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జెడ్పీటీసీ సుధారాణి, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం, ప్రధాన కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఈశ్వర్ అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు అవసరమైన భూమిని పరిశీలించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్, విలేకరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి పెద్దపీట

గొల్లపల్లి(ధర్మపురి): ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి కొప్పుల అన్నారు. బొంకూర్, చిల్వాకోడూర్, బీబీరాజ్‌పల్లి, శ్రీరాముపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్‌లు పద్మావతి, గంగారెడ్డి, సత్యనారాయణ, ఎంపీపీ నక్క శంకర్, వైస్ ఎంపీపీ సత్యం ఉన్నారు.

ధర్మపురి అభివృద్ధికి రూ.15 కోట్లు

ధర్మపురి: పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులకు టీయూఎఫ్‌డీసీ నుంచి రూ.15 కోట్లు మంజూరైనట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు.

మూగబోయిన శాస్త్రులపల్లి

- మావోయిస్టు నేత మీసాల రాజిరెడ్డి మృతి?
- అంచలంచెలుగా అగ్రశ్రేణి నాయకుడిగా..
- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో తనదైన ముద్ర
- చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న స్నేహితులు
- కన్నీరు పెట్టుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు



భారీ పోలీసు బందోబస్తు మధ్య కోర్టుకు హాజరైన మావోయిస్ట్ అగ్రనేత రాజిరెడ్డి(ఫైల్)

మంథని: మరో ఉద్యమ కెరటం నేలవాలింది. నాలుగున్నర దశాబ్దాల అజ్ఞాత జీవితానికి తెరపడింది. మారుమూల మంథని గడ్డపై పుట్టి, విప్లవోద్యమాల వైపు ఆకర్శితుడై, చిన్నతనంలోనే పీడిత సమాజం కోసం అడుగులు వేశాడు.. 1975లో మంథనిలో ఇంటర్ చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరిన విప్లవకారుడు మల్లా రాజిరెడ్డి ఉరఫ్ మీసాల రాజిరెడ్డి, సంగ్రామ్ ఉరఫ్ సాయన్న, అలోక్, దేశ్ పాండే అలియాస్ గోపన్న అనారోగ్యంతో ఈ నెల 16న మరణించినట్లు వార్తలు రావడంతో ఆయన సహచరులు కన్నీరు పెట్టుకుంటున్నారు. అయితే అటు మావోయిస్టు పార్టీ గానీ ఇటు పోలీసులు, కుటుంబసభ్యులు గానీ ఆయన మృతిని ధ్రువీకరించలేదు. రాజిరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని దండకారణ్యంలో మావోయిస్టు గెరిల్లా దళాలను ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావుకు సమకాలీకుడిగా పేరున్న రాజిరెడ్డి ఇక లేరన్న వార్త నాలుగు రాష్ట్రాల దండకారణ్య అటవీ ప్రాంతాల్లో విషాదం నింపింది.

కొండపల్లి స్ఫూర్తితో ఉద్యమ బాట

మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి శాస్త్రులపల్లికి చెందిన మల్లా రాధమ్మ(రాజమ్మ)–వెంకట్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు రాజిరెడ్డి, చిన్న కొడుకు భీమా రెడ్డి. వీరిది వ్యవసాయ కుటుంబం. 1975లో గ్రామంలో జరిగిన ఓ సంఘటనలో రాజిరెడ్డిపై కేసు నమోదై, జైలుకు వెళ్లాడు. వరంగల్ జైలులో ఉన్న సమయంలో పీపుల్స్‌వార్ వ్యవస్థాపకుడు కొండపల్లి సీతారామయ్య వర్గానికి చెందిన కొంతమందితో పరిచయం ఏర్పడింది. జైలు జీవితం అనంతరం ఆయన కొండపల్లి సీతారామయ్య స్ఫూర్తితో ఉద్యమ బాట పట్టినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సింగరేణి ఉద్యోగం కాదని..

రాజిరెడ్డితోపాటు ఆయన సోదరుడు భీమారెడ్డికి సింగరేణి సంస్థలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరాలని తండ్రి వారికి సూచించారు. కానీ రాజిరెడ్డి తనకు వచ్చిన కాల్ లెటర్‌ను చించేసి, విప్లవోద్యమం వైపు వెళ్లాడు. ఆయన సోదరుడు మాత్రం సింగరేణి ఉద్యోగం చేసి, విరమణ పొందాడు.

మేనమామ కూతురితో వివాహం

రాజిరెడ్డి తన మేనమామ రామగిరి(అప్పుడు ముత్తారం) మండలంలోని రామయ్యపల్లికి చెందిన మట్ట కృష్ణారెడ్డి కూతురు రత్నమ్మను వివాహం చేసుకున్నాడు. రాజిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత పోలీసుల వేధింపులు పెరగడంతో ఆమె సైతం 1982లో పీపుల్స్‌వార్ పార్టీలోకి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. అక్కడే వారికి కూతురు స్నేహలత జన్మించడంతో ఆరేళ్ల వయసులో పాపను సోదరుడి చేతిలో పెట్టారు. ఆయన పెంచి పెద్దచేసి, చదివించాడు. తీవ్ర నిర్బంధంలో ఎవరూ రాలేని పరిస్థితిలో మంథనిలోని ఎకరన్నర భూమిని అమ్మి, మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లిలో ఆమెకు కాసీం అనే వ్యక్తితో వివాహం జరిపించారు. స్నేహలత న్యాయవాదిగా పని చేస్తున్నట్లు తెలిసింది. రత్నమ్మ మరణించిన తర్వాత రాజిరెడ్డి అజ్ఞాతంలోనే బీచ సుగుణ ఉరఫ్ సంగీతను వివాహం చేసుకున్నట్లు సమాచారం.

తల్లిదండ్రుల కడసారి చూపునకు రాలే..

రాజిరెడ్డి తండ్రి 25 ఏళ్ల క్రితం చనిపోయారు. పోలీస్ నిఘా తీవ్రంగా ఉండటంతో ఆయన తన తండ్రిని కడసారి చూసుకునేందుకు రాలేకపోయారు. తల్లి రాజమ్మ 2013లో అనారోగ్యంతో మృతిచెందగా అప్పుడూ రాలేదు. కానీ రెండు నెలల మాసికం రోజు సమీపంలోని అటవీ ప్రాంతానికి వచ్చి, తన కుటుంబసభ్యులను పిలిపించుకొని మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం.

రెండుసార్లు అరెస్టు..

31-01-1950లో జన్మించిన మల్లా రాజిరెడ్డి రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. 1988లో ధర్మపురిలో తొలిసారి, 2007 డిసెంబర్ 14న కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం పట్టణం ఎస్ఆర్ ప్లాజా వద్ద రెండోసారి అరెస్టయ్యారు. 18 నెలల జైలు జీవితం గడిపిన రాజిరెడ్డి మళ్లీ 2009 అక్టోబర్ 7 అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో ఆయన అనేక సంఘటనల్లో కీలకంగా వ్యవహరించాడు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఆంధ్ర, ఒడిశా బార్డర్ దండకారణ్య సెక్రటరీగా ఉన్నట్లు సమాచారం. రాజిరెడ్డిపై మహదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో మాజీ స్పీకర్ శ్రీపాదరావు హత్య కేసుతోపాటు కరీంనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హత్య కేసు నమోదయ్యాయి. అంతేకాకుండా పెద్దపల్లి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9, దేశ వ్యాప్తంగా 40కి పైగా కేసులు ఉన్నట్లు సమాచారం. ఆయనపై రాష్ట్రంలో రూ.25 లక్షలు, ఆయా రాష్ట్రాల్లో మరో రూ.75 లక్షల నజరానా ఉంది.

ప్రతీ చిత్రం.. ఓ జ్ఞాపకం

- చరిత్రను సజీవంగా నిలిపేది.. ఎన్నో భావాలను తెలిపేది ఫొటో
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం
- ఉమ్మడి జిల్లాలో ఫొటోగ్రఫీలో రాణిస్తున్న పలువురు మహిళలు

కరీంనగర్ కల్చరల్: ప్రతీ క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించగలిగేది, కాలం గర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది, ఎన్నో జ్ఞాపకాలను ఎప్పటికీ మన కళ్లముందుంచేది ఫొటో. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకే ఉంది. ఈ ఆధునిక కాలంలో దానికి మానవ జీవితంతో విడదీయలేని బంధం ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు. క్లుప్తంగా చెప్పాలంటే కాంతితో చిత్రాన్ని గీయడం. నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు మహిళలు ఫొటోగ్రఫీలో తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు.



గోల్డ్ మెడల్‌కు ఎంపికైన ఫొటో

కేదార్‌రెడ్డి ఫొటోకు గోల్డ్ మెడల్



కేదార్‌రెడ్డి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల ఇంటర్నేషనల్ సిలన్ వారు ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. దేశ, విదేశాల నుంచి 220 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఇందులో కరీంనగర్‌కు చెందిన సిగ్మా ఫొటో స్టూడియో నిర్వాహకుడు మహిమల కేదార్‌రెడ్డి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఆయన తీసిన చిన్నారిని ఎత్తుకున్న తల్లి బ్లాక్ అండ్ వైట్ చిత్రం అవార్డు దక్కించుకుంది. ఈ పోటీల్లోనే కలర్ విభాగంలో రిబ్బన్ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 20న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ స్టేడియంలో అవార్డు అందించనున్నారని, ఈ మేరకు శుక్రవారం సమాచారం అందిందని పేర్కొన్నారు.

నా భర్త దగ్గరే నేర్చుకున్న

– కటుకం స్రవంతి, చైతన్య డిజిటల్ ఫొటో స్టూడియో

నేను కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో 2006లో డిగ్రీ పూర్తి చేశా. 2007లో ఫొటోగ్రాఫర్ సుధాకర్‌తో వివాహం జరిగింది. 2008 నవంబర్ 2న చైతన్య డిజిటల్ ఫొటో స్టూడియో ప్రారంభించాం. నా భర్త దగ్గరే ఫొటోలు తీయడం నేర్చుకున్న. మాకు ఇద్దరు కుమారులు. 2014లో భర్త అనారోగ్యంతో చనిపోయారు. కుటుంబ పోషణకు ఫొటోగ్రాఫర్‌గా మారాను. ఇప్పటివరకు 30 వెడ్డింగ్ ఈవెంట్స్ చేశా. 2023లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి కలెక్టర్ కర్ణన్ చేతుల మీదుగా సన్మానం పొందాను.



స్రవంతిని సన్మానిస్తున్న కలెక్టర్ కర్ణన్ (ఫైల్)

భర్త ప్రోత్సాహంతో స్టూడియో



శ్రీలలిత

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని తిరుమల్‌నగర్‌కు చెందిన కాటారపు శ్రీలలిత పదో తరగతి వరకు చదువుకుంది. డిజిటల్ కెమెరాల్లో అద్భుతమైన ఫొటోలు తీస్తోంది. భర్త సంతోష్ టైలరింగ్ పని చేస్తున్నాడు. మొదట్లో ఆయనకు ఆర్థికంగా తోడుగా ఉండేందుకు ఓ ఫొటో ల్యాబ్‌లో రిసెప్షనిస్టుగా ఏడేళ్లు పని చేసింది. రెండేళ్ల క్రితం భర్త, అత్తామామ ప్రోత్సాహంతో రూ.3 లక్షలు అప్పు చేసి, శ్రీలలిత డిజిటల్ స్టూడియో ఏర్పాటు చేసింది. పెళ్లిళ్లు, పుట్టిన రోజు తదితర కార్యక్రమాల్లో ఫొటోలు తీస్తోంది. భర్తతోపాటు మరో ఇద్దరు పేదలకు ఉచితంగా ఫొటోగ్రఫీ నేర్పిస్తోంది.

నాన్న ఆర్టిస్ట్ కావడంతో..



కొండగట్టులో స్రవంతికి సన్మానం (ఫైల్)

కరీంనగర్ కల్చరల్: నాన్న పాశం వరద రాజు ఆర్టిస్ట్. అందువల్ల నాకు ఫొటోగ్రఫీపై ఇష్టం ఏర్పడింది. నెగెటివ్ ప్రింటింగ్, ఫ్లెక్సీ, రోల్స్ డెవలపింగ్, ఫొటోగ్రాఫిక్స్, ఆల్బమ్ క్రియేషన్ నేర్చుకున్న. నా భర్త శ్రీనివాస్ సపోర్ట్‌తో 2021లో శ్రీలక్ష్మీగణపతి స్టూడియో ప్రారంభించా. మాకు ఇద్దరు అబ్బాయిలు. 2022లో జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ వారు కొండగట్టులో నన్ను సన్మానించారు. ప్రస్తుతం ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మహిళా విభాగం కరీంనగర్ పట్టణ జాయింట్ సెక్రటరీగా ఉన్నాను.

– గాలిపెల్లి స్రవంతి,
శ్రీలక్ష్మీగణపతి డిజిటల్ ఫొటో స్టూడియో

ఎల్లలు దాటిన నాన్నమ్మ ఫొటో



మమత



మమత తీసిన ఫొటో

సిరిసిల్లకల్చరల్: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంకెపల్లికి చెందిన గుగులోతు మమత తంగళ్లపల్లి గిరిజన సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో ఫ్యాషన్ టెక్నాలజీ డిగ్రీ చదువుతోంది. ఆమెకున్న ఫొటోగ్రఫీ అభిరుచిని తండ్రి భీమానాయక్ ప్రోత్సహించారు. మమత తీసిన సంప్రదాయ దుస్తుల్లో ఉన్న తన నాన్నమ్మ ఫొటో ఇటీవల అంతర్జాతీయ ఫొటో మ్యాగజైన్ వోగ్ ఇటాలియా ముఖచిత్రంగా ముద్రితమైంది. దీంతో మంత్రి కేటీఆర్ ఆమెను ట్విట్టర్ వేదికగా ప్రశంసించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి జ్ఞాపిక అందజేసి, అభినందించారు.

1,200కు పైగా లఘుచిత్రాలకు కెమెరాఉమెన్



ఈ మొగుళ్లు మాకొద్దు లఘుచిత్రంలోని స్టిల్



అనితారాజ్

విద్యానగర్(కరీంనగర్): చొప్పదండికి చెందిన అనితారాజ్‌కు ఫొటోగ్రఫీపై మక్కువ. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ షార్ట్ ఫిల్మ్ కెమెరాఉమెన్‌గా తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుత చిత్రాలను అందిస్తోంది. ఏఆర్ఎస్ క్రియేషన్స్ యూట్యూబ్ చానల్ స్టోరీ రైటర్‌గా, డైరెక్టర్‌గా, ఎడిటర్‌గా చేస్తోంది. ఇప్పటివరకు 1200కు పైగా లఘుచిత్రాలకు కెమెరాఉమెన్‌గా పని చేసింది. ఉత్తమ కెమెరాఉమెన్‌గా పలు సంస్థల నుంచి అవార్డులు అందుకుంది. ఈ మొగుళ్లు మాకొద్దు లఘు చిత్రంలోని స్టిల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు వచ్చింది.



అవార్డు అందుకుంటున్న తులసి

ఫొటోలు తీస్తూ.. ఆల్బమ్స్ తయారీ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన డీవీఆర్ తులసి తండ్రి వెంకటరమణ ప్రోత్సాహంతో ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకుంది. ఆయన డీవీఆర్ పేరుతో ఫొటోస్టూడియో ప్రారంభించగా పెళ్లిళ్లు, పుట్టిన రోజు కార్యక్రమాల్లో ఫొటోలు తీస్తూ ఆల్బమ్స్ తయారు చేస్తోంది. 2020–21లో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి డీకే అరుణ చేతులమీదుగా శ్రీ దాత్రి పురస్కారం అందుకుంది. గతేడాది రాష్ట్రస్థాయి పోటీల్లో బెస్ట్ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ అవార్డు గెలుచుకుంది. తెలంగాణ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తోంది.

జమ్మికుంట ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

జమ్మికుంట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విజయవాడలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ వడ్లూరి అరుణ్‌కుమార్‌కు జాతీయ స్థాయిలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ ఆనర్ అవార్డును ముఖ్య అతిథులు డాక్టర్ జేబీ రావు, ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, మండలి మాజీ ఉప సభాపతి బుద్ధ ప్రసాద్, పార్లమెంట్ మాజీ సభ్యుడు గోకరాజుల చేతులమీదుగా అందజేశారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆయనను అభినందించారు.

ఒకే శాఖలో పనిచేసినా తేడాలెందుకు?

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఒకేశాఖ.. ఒకేవిధమైన విధులు నిర్వర్తిస్తున్నా ఉద్యోగుల జీతభత్యాల్లో తేడాలు ఎందుకని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. రాత పరీక్ష నిర్వహించకుండానే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్ఎంల సంఘం స్థానిక ఆర్డీవో కార్యాలయ వద్ద చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మద్దతు ప్రకటించారు. మొదటి ఏఎన్ఎంలతో సమానంగా సేవలు అందిస్తున్న రెండో ఏఎన్ఎంలపై ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతోందని విమర్శించారు. ఏఎన్ఎంల సేవలను గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. నాయకులు బండ శంకర్, ముంజాల రఘువీర్‌గౌడ్, గుండ మధు, గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, ఎలిజబెత్, రాజమణి, మధులత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజల బతుకులు మారుతాయి

మల్యాల(చొప్పదండి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజల బతుకులు మారుతాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. నూకపల్లి, రామన్నపేటలో కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో గడప గడపకూ కాంగ్రెస్ నిర్వహించారు. తొలుత మేడిపల్లి సత్యం మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించిందే కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ మద్యం విక్రయాల్లో అభివృద్ధి చెందిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అర్హులైన ప్రతీ నిరుపేదకు రూ.5లక్షలు ఇస్తామని, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, రైతులకు క్వింటాల్‌పై అదనంగా రూ.500 మద్దతు ధర కల్పిస్తామని అభయం ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, సర్పంచ్ మారంపల్లి సరోజన, మాజీ జెడ్పీటీసీ మారంపల్లి లక్ష్మణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనిగరపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టించుకోరా?



రాస్తారోకో చేస్తున్న నాయకులు

వెల్గటూర్(ధర్మపురి): సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయని ఏడుస్తున్న రైతుల గోడును పట్టించుకోరా? అని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. ఎస్సారెస్పీ డీ–83బీకాలువ మరమ్మతులు పూర్తిచేసి వెంటనే సాగునీరు విడుదల చేయాలనే డిమాండ్‌తో ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై శుక్రవారం రైతులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం, వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని 12 గ్రామాల పరిధిలో సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. దీనికి సాగునీరు అందించే ఎస్సారెస్పీ డీ–83బీ కాలువ రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిందని తెలిపారు. నెలలు గడిచినా కాలువను పునరుద్ధరించలేదన్నారు. దీంతో వేల ఎకరాల్లో పత్తి పంట ఎండిపోతోందని చెప్పారు. నీరు లేక రైతులు నాట్లు వేయకుండా పొలాలను బీళ్లుగా వదిలేశారని అన్నారు. నాట్లు వేసిన వారు పంట ఎండిపోతుందని ఆవేదనలో ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే కాలువ మరమ్మతులు పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వెల్గటూర్, ధర్మపురి మండలాల అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, సంగనబట్ల దినేశ్, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, ఎంపీటీసీ అనుమాల మంజుల, నాయకులు పూదరి రమేశ్, గుమ్ముల వెంకటేశ్, గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గల్ఫ్ ఏజెంట్ల అరెస్ట్

- విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం
- రూ.4.50 లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటస్వామి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాలక్రైం: నిరుద్యోగులకు విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసిన ఇద్దరు గల్ఫ్ ఏజెంట్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. బుగ్గారం మండలం.. శెకల్లకు చెందిన రౌతు వాసు, పెగడపల్లి మండలం సుద్దపల్లికి చెందిన రాచకొండ మహేశ్ జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్డులో శ్రీ విఘ్నేశ్వర మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేశారు. రౌతు వాసు ఆరేళ్ల క్రితం ఇరాక్‌కు వెళ్లగా పంజాబ్‌కు చెందిన జాసన్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది. యూరప్‌కు పంపించేందుకు వర్క్ పర్మిట్ వీసాలు పంపిస్తానని జాసన్‌సింగ్ చెప్పడంతో వాసు, మహేశ్ ట్రావెల్స్ ఏర్పాటు చేసి సుమారు 120 మంది వద్ద నుంచి రూ.2.90 కోట్ల వరకు వసూలు చేశారు. కాగా రూ.35 లక్షలు వీసా వెరిఫికేషన్‌కు, రూ.40 లక్షలు హైదరాబాద్, జగిత్యాల కార్యాలయాల కోసం, రూ.19 లక్షలతో రెండు కార్లు, రూ.5 లక్షలతో రెండు మొబైల్‌లు కొనుగోలు చేశారు. దీంతో విదేశాలకు పంపించేందుకు జాప్యం చేస్తుండటంతో బాధితులు జాసన్‌సింగ్‌కు ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. వారంతా మోసపోయినట్లు గుర్తించి నాలుగు రోజుల కింద పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.4.50 లక్షల నగదు, నాలుగు కంప్యూటర్లు, ఏసీలు, వీసా డాక్యుమెంట్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ...యువత నకిలీ ఏజెంట్లను సంప్రదించి మోసపోవద్దన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

జగిత్యాల: ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ పత్రాలు సెప్టెంబర్ 15 నాటికి పంపిణీ పూర్తిచేయాలన్నారు. స్వాతంత్య్ర వజ్రోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలన్నారు. ఆగస్టు 26న జరిగే ప్లాంటేషన్‌లో అన్నివర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. బీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయాన్ని లబ్ధిదారులకు అందించాలని సూచించారు. గృహలక్ష్మి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షల 40 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. సోషల్ వెల్ఫేర్ శాఖ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 26న కోటి మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ బీఎస్.లత, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న బస్సు డ్రైవర్



డీఎం చేతుల మీదుగా పర్సు అందజేస్తున్న వెంకటేశ్

సారంగాపూర్: పోగొట్టుకున్న పర్సును అందజేసి ఆర్టీసీ బస్సుడ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. సారంగాపూర్ గ్రామానికి చెందిన కారు వెంకటేశ్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని సారంగాపూర్‌కు వెళ్తుండగా జగిత్యాల బైపాస్ రోడ్డుపై పర్సు కనిపించింది. బుగ్గారం మండలం వెల్గొండకు చెందిన మహమ్మద్ ఫిరోజ్‌దిగా గుర్తించి ఫోన్‌చేశాడు. అనంతరం డీఎం చేతుల మీదుగా ఫిరోజ్‌కు పర్సు అందజేశాడు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను వారు అభినందించారు.